సమాజాభివృద్ధికి ఆర్ఎస్ఎస్ కృషి



కొంపల్లిలో పథసంచలన్ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు



ఆర్ఎస్ఎస్ ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న రాజీవ్‌చౌహాన్, సోమయాజులు

కుత్బుల్లాపూర్: సమాజాభివృద్ధికి ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అఖిల భారత మార్గదర్శకుడు పీవీఆర్ సోమయాజులు అన్నారు. ఆర్ఎస్ఎస్ బోయిన్‌పల్లి భాగ్ ఆధ్వర్యంలో కొంపల్లి పురవీధుల్లో ఆదివారం పథసంచలన్ నిర్వహించారు. సుమారు 450 మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమానికి మహీంద్రా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, మాజీ ఆర్మీ అధికారి రాజీవ్ చౌహాన్ హాజరై భారతమాత, ఆర్ఎస్ఎస్ ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమయాజులు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ అనేది ఏ మతానికి చెందినది కాదని, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ సమాజాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఇటీవల కేరళలోని వయనాడ్‌లో జరిగిన వరద బీభత్సంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సహాయక కార్యక్రమాల్లో పాల్గొని వందలాది మంది ప్రాణాలను కాపాడమే కాకుండా ఆహార పదార్థాలు అందించారని గుర్తు చేశారు.



కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు

తెలంగాణ ఆవిర్భావంలో ఉద్యమకారుల పాత్ర కీలకం



జవహర్‌నగర్‌లో సమావేశమైన తెలంగాణ ఉద్యమకారులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు పిన్నోజు సుధాకర్‌చారి ఆధ్వర్యంలో ఆదివారం జవహర్‌నగర్ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు చీమ శ్రీనవాస్‌రావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమన్నారు. ఉద్యమకారుల భవిష్యత్తు కోసం పోరాడుదామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. అనంతరం ఉద్యమకారులకు ధ్రువీకరణ పత్రం, జ్ఞాపికను అందచేశారు. కార్యక్రమంలో నేతలు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, పరుశురాం, ప్రకాష్, నర్సింహా, మహేష్, ఎల్లస్వామి, సిద్దులు యాదవ్, వెంకటేష్‌గౌడ్, సోమయ్యగౌడ్, బాల్‌నర్సింహా, సిద్ధిరాములు, ఎం.ఎస్.చారి, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మరింత దన్ను!

- 10 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు
- మరో 13 క్యాంటీన్ల ఏర్పాటుకూ చర్యలు
- గ్రామీణ, పట్టణ మహిళా సంఘాల సభ్యులు నిర్వహించేలా చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: మహిళలను లక్షాధికారులను చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకొని చిన్నపాటి వ్యాపారాలు నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయటంతో పాటు మహిళా సభ్యులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ.. ఆర్థికంగా వారి కుటుంబాలు ఎదిగేలా చిన్నతరహా, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సర్కారు రుణ సదుపాయాన్ని కల్పిస్తోంది. అందులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇందిరా మహిళా శక్తి అధ్వర్యంలో పట్టణ పురపాలక సంఘాల్లో మెప్మా అధ్వర్యంలో ఏడు మహిళా క్యాంటీన్లు, గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ ద్వారా మూడు క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పించింది.

◆ దుండిగల్, బోడుప్పల్‌లో రెండు, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, నాగారం, కంటోన్మెంట్‌సహా బోడుప్పల్‌లో రెండు మహిళా క్యాంటీన్లు మెప్మా అధ్వర్యంలో ఏర్పడగా, కలెక్టరేట్, సచివాలయం, ఎంసీపల్లిలో సెర్ప్ ద్వారా క్యాంటీన్లను మహిళా సంఘాలు ఏర్పాటు చేశాయి.

◆ జిల్లాలో మరో 13 మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మెప్మా అధ్వర్యంలో పీర్జాదిగూడ, మేడ్చల్, నిజాంపేటలో సెర్ప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 10 మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది.

పట్టణాలు, బస్తీల్లోని మహిళలకు ఉపాధి..

మెప్మా అధ్వర్యంలో మేడ్చల్ జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 10 మున్సిపల్ సర్కిళ్లు తోసహా 13 పురపాలక సంఘాల్లో రూ. 51 కోట్లతో ఇందిరా మహిళా శక్తి కింద పట్టణ మహిళలకు ఏడు రకాల చిన్నతరహా, కుటీర పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

◆ నిర్మాణ రంగం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ సర్వీస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యక్తిగతంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు కోసం బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తారు.

◆ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటునకు రూ. 10 లక్షల రుణం అందజేయనుంది. ఇందులో 35 శాతం సబ్సిడీ లభించనుంది. పట్టణ మహిళలు చిన్నతరహా, కుటీర పరిశ్రమల స్థాపన కోసం రూ. 3 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటోందని మెప్మా పీడీ అనిల్ తెలిపారు.

సెర్ఫ్ అధ్వర్యంలో గ్రామీణ మహిళలకు..

◆ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 3,390 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా ఇందులో 36,782 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల కొత్తగా 64 మహిళా గ్రూపులు ఏర్పాటు కావటంతో 775 మంది సభ్యులు చేరారు. మహిళా సంఘాల అర్హతను బట్టి మహిళలకు వారి ఉపాధి కల్పనకు రూ. 50 వేల నుంచి రూ. 10 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించేలా డీఆర్‌డీఏ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే మూడు మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు కాగా, మరో 10 క్యాంటీన్ల కోసం కసరత్తు చేస్తోంది. అలాగే 250 కోళ్ల పరిశ్రమలు, 16 మీసేవా కేంద్రాలు, 18 కుట్టు మిషన్ కేంద్రాలు, 1697 కుటీర పరిశ్రమల ఏర్పాటు కోసం డీఆర్‌డీఏ అధికార వర్గాలు చర్యలు తీసుకుంటున్నారు.

◆ ప్రధానంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, కస్టం హైరింగ్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, ఫౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ ఔట్ లెట్లు, మిల్క్ పార్లర్స్ ఏర్పాటు చేసేందుకు మండలాల వారీగా డీఆర్‌డీఏ ప్రణాళికలు తయారు చేస్తోంది. ఇప్పటికే మహిళా సంఘాల సభ్యులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాంబశివరావు తెలిపారు. అలాగే జ్యోతిరావు పూలే గురుకుల విద్యార్థులకు కూడా డ్రెస్సులు కుట్టించేందుకు డీఆర్‌డీఏ చర్యలు తీసుకుంటోంది. ఆయా యూనిట్లు నెలకొల్పేందుకు అర్హులైన మహిళా గ్రూపులు, మహిళా సభ్యులను ఎంపిక చేసేందుకు త్వరలోనే ఇంటర్వ్యూలు తదితర కార్యక్రమాలపై డీఆర్‌డీఏ దృష్టి సారించినట్లు అధికార వర్గాలు వెల్లడించారు.

శామీర్‌పేట్ వరకు మెట్రోను విస్తరించాలి

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్
- మెట్రోసాధన సమితి ఆధ్వర్యంలో ధర్నాకు హాజరు
- మద్దతు తెలిపిన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మెట్రో రెండో దశలో కొంపల్లి ప్రాంతానికి ప్రాధాన్యత ఇస్తూ మేడ్చల్, శామీర్‌పేట్ వరకు విస్తరించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మెట్రోసాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ధర్నాకు ఆయనతో పాటు ఎమ్మెల్యే వివేకానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

ఈటల మాట్లాడుతూ సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్, శామీర్‌పేట్ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఐటీ ఉద్యోగులు ఈ ప్రాంతంలో అధికంగా ఉండడంతో పాటు జీడిమెట్ల, దూలపల్లి పారిశ్రామికవాడల నేపథ్యంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోందన్నారు. మెట్రో రైల్‌ను జూబ్లీ బస్టాండ్ నుంచి జాతీయ రహదారి–44 మీదుగా సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్, శామీర్‌పేట్ వరకు పొడిగించాలని, అందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందేలా తాను బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు.

మెట్రో రైలు సాధించుకుని తీరుతాం.. ఎమ్మెల్యే వివేకానంద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ మండిపడ్డారు. మెట్రో సాధన సమితి ధర్నాకు ఆయన హాజరై మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మెట్రో విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణంతో నగరానికి ఉత్తరం వైపున కొంపల్లి, మేడ్చల్ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అంతేగాకుండా తూంకుంట, శామీర్‌పేట్ ప్రాంతాలకు మెట్రో విస్తరణపై సర్వే సంస్థలను ఎంపిక చేసి పనులు అప్పగిస్తే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఒంటెద్దు పోకడలతో ఆ ప్రణాళికను పక్కనబెట్టి ఫోర్త్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపారని ఆరోపించారు. ఉత్తర తెలంగాణకు నగరానికి కనెక్టివిటీగా ఉన్న జాతీయ రహదారి- 44 లో మేడ్చల్ ప్రాంతం గుండా నిత్యం నిజామాబాద్, కరీంనగర్, ప్రాంతాల మంత్రులు ప్రయాణిస్తుంటారని, మేడ్చల్‌కు మెట్రోను విస్తరించకుంటే ఈ మార్గంలో ఏ ఒక్క మంత్రిని కూడా తిరగనివ్వమని హెచ్చరించారు. మెట్రో విషయంలో అన్యాయం జరిగితే ఊరుకోమని, పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టి మెట్రో రైలును సాధించుకుంటామని ఎమ్మెల్యే వివేకానంద్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యుడు సంపత్ రెడ్డి, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, కార్యదర్శి భరత్ సింహారెడ్డి, రాజిరెడ్డి, సతీశ్ రంగంపేట, పత్తి సతీశ్, పులి బలరాం, నల్ల జయశంకర్‌గౌడ్, శేఖర్ యాదవ్, శ్యామ్‌కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సమావేశం

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్‌లోని కామ్రేడ్ కమలాకర్‌రెడ్డి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం సమావేశాన్ని సీనియర్ నాయకుడు వరప్రసాద్ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మండల సీపీఎం కార్యదర్శిగా కీలుకాని లక్ష్మణ్ ఎన్నుకోగా, మండల కమిటీ సభ్యులుగా వసుల అంజయ్య, సత్యం, రావుల స్వాతి, దేవదానం, కరుణాకర్, జాకీర్ హుస్సేన్‌ను నియమించారు. అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పక్కన బెట్టి హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తోందన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఖరిపై నిరసనలు చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు హరిప్రసాద్, వెంకన్న, బీరప్ప, శంకర్, లక్ష్మి, అంజనేయులు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మ బోనాల సందడి



నిజాంపేట్: నిజాంపేట్ జర్నలిస్ట్‌కాలనీలోని చెర్ల ఎల్లమ్మ ఆలయ బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు.. శివ సత్తుల పూనకాల మధ్య మహిళలు, చైతన్య విద్యాసంస్థల సిబ్బంది అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కూన వెంకటేశంగౌడ్ మృతి తీరనిలోటు



సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్యగౌడ్ తదితరులు

జగద్గిరిగుట్ట: కూన వెంకటేశంగౌడ్ మృతి గౌడ కులస్తులకు తీరని లోటని ఐఎన్‌టీయూసీ నేత, టీసీఎస్ అధ్యక్షుడు గూడ ఐలయ్యగౌడ్ అన్నారు. శ్రీనివాసనగర్‌లో ఎన్టీఆర్‌నగర్ గౌడ సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తుల సహకార సంఘాల ఏర్పాటుకు వెంకటేశంగౌడ్ ఎంతో కృషి చేశారని, రాష్ట్రంలో ఏ ప్రభుత్వమున్నా కులస్తుల వృత్తి రక్షణకు తాటి, ఈత వనాలు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారన్నారు. అలాగే నగరంలో కల్లు దుకాణాలు సహకార సంఘాలను ఏకం చేసి కులస్తులకు అండగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో టీసీఎస్ డైరెక్టర్లు అంజన్‌గౌడ్, విఠల్‌గౌడ్, సాయిగౌడ్, స్వామిగౌడ్, రాజలింగంగౌడ్, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభూమి రక్షణకు రాణి దుర్గావతి పోరాటం



రాణి దుర్గావతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: మాతృభూమి రక్షణకు పోరాడిన ధీర వనిత రాణి దుర్గావతి అని డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు అన్నారు. ప్రగతినగర్‌లో మహారాణి దుర్గావతి జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాణి దుర్గావతి మొగలు చక్రవర్తి అక్బరును మూడుసార్లు ఓడించిన ధీరవనిత అని కొనియాడారు. ఆమె గోండు జాతిని హిందూ సమాజంలో అంతర్భాగం చేసి యావద్దేశానికే రాణి అయిందన్నారు. బీజేపీ నాయకులు సూర్యనారాయణ, సత్య కాటేపల్లి, నరేంద్రచౌదరి, కిశోర్, మైలారం అశోక్, రచ్చ చక్రధర్, అజయ్ కుమార్‌రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్ భరత్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

నియోజకవర్గవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవార్లను అన్నపూర్ణగా, శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల్లో అన్నదానాలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పలు ఆలయాల్లో చండీహోమం, గణపతిహోమాలు నిర్వహించారు.–కుత్బుల్లాపూర్



పూజల్లో బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి..



బాచుపల్లిలో పూజల్లో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు..



వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో శాకాంబరిగా రేణుకా ఎల్లమ్మ

జగద్గిరి గుట్టలోని శాకాంబరి అవతారంలో నల్లపోచమ్మ





నిజాంపేట్ దుర్గామాత ఆలయంలో..

జగద్గిరిగుట్ట కొండపై అన్నపూర్ణగా కాళికా మాత..





బహదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్‌కాలనీలో..



సంజయ్‌పురి కాలనీలో అన్నదానం..



నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో పూజలు..



కొంపల్లి ఎన్‌సీఎల్‌లో చండీ హోమం..

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రం ఇస్తున్న పద్మానగర్ కాలనీవాసులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ మండలపరిధిలోని సర్వే నెంబర్ 58 నుంచి 226 వరకు ఉన్న స్థలాల రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ పద్మానగర్ కాలనీ ఫేజ్–2 వాసులు ఆదివారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు స్థలాలు ఉన్నాయన్న నెపంతో కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్లను నిలిపేశారని, దీంతో కొత్తగా ఇళ్లు కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బుచ్చి లింగంగౌడ్, దుర్గారావు, ఓబుల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అప్పారావు, శ్రీనివాస్, ప్రభాకర్, వెంకన్న ఉన్నారు.

చింతల్ భాగ్యరథి జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

కుత్బుల్లాపూర్: చింతల్ భాగ్యరథి జూనియర్ కళాశాలలో ఆదివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కళాశాల డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, గోవిందరెడ్డి, రమేశ్ బాబు, రామకృష్ణ, జైశంకర్‌గౌడ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కళాకారుల కార్యవర్గం ఎన్నిక

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర నాటక సమాజ సమాఖ్య ఉపాధ్యక్షుడు సోమ అంజిరెడ్డి, ప్రచార కార్యదర్శి దుర్వాస రాజుల ఆధ్వర్యంలో సెంట్రల్‌కమిటీ ఆదేశాల మేరకు భారత వికాస్ పరిషత్‌లో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కళాకారుల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గురకుంట మణిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ములుగు రామాచారి, ప్రధాన కార్యదర్శిగా కఠారి సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా సోమర ఎర్రిస్వామి చౌదరి, కోశాధికారిగా గోగినేని ఉమామహేశ్వరరావు, సభ్యులుగా జయరాం, ఏ. వెంకటేశ్, నాగరాజులను ఎన్నుకున్నారు.

రక్తదాన శిబిరం

కూకట్‌పల్లి: సంకల్ప ప్రింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని చింతపట్ల వెంకయ్య పార్కు ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, బాబురావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.

మహిళ హత్యకేసులో నిందితురాలి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్, పోలీసులు



ప్రియాంక (ఫైల్)



నిందితురాలు మంజుల

మూసాపేట: గత నెలలో కేపీహెచ్‌బీకాలనీ లోధా ఎదురుగా నిర్మానుష్య ప్రాంతంలో జరిగిన మహిళ హత్య కేసులో నిందితురాలిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ సురేశ్ కుమార్ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం, అంబం గ్రామానికి చెందిన ధర్మారం ప్రియాంక (23)ను భర్త వదిలివేయడంతో తన కూతురిని తల్లి వద్ద వదిలి 2 నెలల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చింది. కేపీహెచ్‌బీకాలనీలో ఫుట్‌పాత్‌పై ఉంటూ వ్యభిచారం చేస్తూ రాత్రి సమయంలో అక్కడే ఉండేది. అదేవృత్తిలో ఉన్న తాండూర్‌కు చెందిన మరో మహిళ మంజుల (35) ఎల్లమ్మబండ ఎన్టీఆర్‌నగర్‌లో అద్దె ఇంటిలో ఉంటున్నది. ఆమెతో ప్రియాంకకు పరిచయం ఏర్పడింది. ప్రియాంక 20 రోజుల కిందట తన వెండి పట్టి గొలుసులు, మట్టెలు భద్రపర్చాలని మంజులకు ఇచ్చింది. వారం రోజులుగా తన వెండి వస్తువులు తిరిగి ఇవ్వాలని మంజులను కోరగా స్పందించలేదు. గత నెల 30న మంజుల కేపీహెచ్‌బీ నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో జగద్గిరిగుట్ట నాలా వద్ద ప్రియాంక ఆపింది. తన స్నేహితులతో ప్రియాంక మంజులను బెదిరించింది. అనంతరం ఇంటికి వెళ్లి వస్తువులను తీసుకున్న ప్రియాంక తర్వాత స్నేహితులు వెళ్లిపోయారు. అయితే ప్రియాంకతో తనకు ఎప్పటికైనా ప్రాణహాని ఉంటుందని భావించి చంపేయాలని నిర్ణయించుకున్నది. పథకం ప్రకారం అదే రోజు రాత్రి ప్రియాంకకు బాగా మద్యం తాగించి, తాను మాత్రం కొంచెం తీసుకున్నది. రాత్రి 11.20 గంటల ప్రాంతంలో ప్రియాంకను స్కూటీపై ఎక్కించుకుని కేపీహెచ్‌బీలోని లోధా అపార్టుమెంట్ ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లింది. ప్రియాంకను కిందపడేసి లేజర్ బ్లేడ్‌తో గొంతు కోసింది. మృతి చెందిందని నిర్ధారించుకున్న తర్వాత అనుమానం రాకుండా ఉండేందుకు లైంగిక దాడి జరిగి చనిపోయినట్లుగా చిత్రీకరించింది. ప్రియాంక ఒంటిపై ఉన్న ప్యాంట్, బట్టలను అదే బ్లేడ్‌తో కట్‌చేసి మెడపై భాగం నుంచి ఛాతీ వరకు, మర్మాంగంపై గాట్లు పెట్టింది. అనంతరం ఇంటికి వెళ్లిపోయింది. పోలీసుల దర్యాప్తులో మంజుల ఇంటి వద్ద ఉండగా పట్టుకున్నారు. రెండు వెండి గొలుసులు, మట్టెలు, లేజర్ బ్లేడ్, రక్త మరకలతో ఉన్న చీర, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆమెను రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులకు డీసీపీ సురేశ్‌కుమార్ రివార్డు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, కూకట్‌పల్లి సీఐ ముత్తు తదితరులు పాల్గొన్నారు.